పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 57 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 31 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :57 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : VISAKHAPATNAM SAT 31 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం

- యూసీసీ అమలు చేస్తాం
- 30 ఏళ్ల వరకు ఎస్పీకి అధికారం లేదు
- రామభక్తులపై కాల్పులను గుర్తుచేసిన షా
- ఓటు చోరీపై చర్చకు సిద్ధం
- యూసీసీపై దేశవ్యాప్త చర్చ

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై కీలక నిర్ణయం

- మధ్యవర్తిగా జస్టిస్ దేశాయ్ నియామకం
- ఇరుపక్షాల అంగీకారంతో నిర్ణయం
- పరిష్కారానికి నిపుణుల సహకారం
- మధ్యవర్తిత్వానికి పూర్తి సహకారం
- నాలుగు వారాల తర్వాత సమీక్ష
- విచారణ నిలిపివేతకు గతంలో నిరాకరణ

1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా

- 36,351 మందితో బందోబస్తు
- 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్
- 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

అమరావతి

నవంబర్ 1న జరగనున్న వంద పట్టణ స్థానిక సంస్థల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తోంది. పోలీసు సిబ్బందితో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో గ్రాఫర్ల ద్వారా నిరంతర నిఘాకు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ జిల్లాల్లో 671 పోలింగ్ కేంద్రాలను అత్యంత సున్నితమైనవిగా గుర్తించి వాటి వద్ద 3,355 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. మరో 1,233 సున్నిత కేంద్రాల కోసం మరో 4,943 మందిని సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వివరాలు 2లో..

తుపాను బాధితుల కష్టం తెలుసు..

ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- సీఎం చంద్రబాబు భరోసా
- పశ్చిమగోదావరి జిల్లాల్లో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- తుపాను బాధితులను ఆదుకుంటామని, పంటల బీమాతో ధీమా కల్పిస్తామని హామీ
- 15 వేల విద్యుత్ స్తంభాలు కూలాయని, సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- తుపాను నష్టం ప్రాథమికంగా రూ.4,600 కోట్లుగా అంచనా
- బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ
- అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడదల

అమరావతి

'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. నీట మునిగిన పంటలతో కన్నీరు పెడుతున్న రైతులు, తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న కొబ్బరి రైతులు, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను వివరాలు 2లో..

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

- ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో కుప్పకూలిన హెలికాప్టర్
- బద్రీనాథ్ నుంచి బయల్దేరిన కాసేపటికే గాల్లో సంబంధాలు కోల్పోయిన విమానం
- మృతుల్లో పైలట్‌తో పాటు కర్ణాటకకు చెందిన ఐదుగురు యాత్రికులు
- ప్రమాదం నేపథ్యంలో ట్రాన్స్ భారత్ ఏవియేషన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత
- వరుస ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ సీఎం హరీశ్ రావత్

నవంబర్ 20 వరకు గడువు పొడిగింపు

- 30న తుది ఓటర్ల జాబితా
- ఈసీ తాజా ఉత్తర్వులు జారీ
- వివేక్ యాదవ్ వెల్లడి
- ఆరు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్
- అధికారుల అభ్యర్థనతో గడువు పెంపు
- ఢిల్లీకి డిసెంబర్ 22 వరకు గడువు
- దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ తుది దశ

అమరావతి

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో ఐదు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. నవంబరు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నవంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ మేరకు సవరించిన షెడ్యూల్?పై తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో సర్ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. సర్ వివరాలు 2లో..

49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

- 2.6 శాతానికి తీవ్ర పేదరికం.. ఉపాధితో తగ్గిన పేదరికం
- సంక్షేమ పథకాలతో ఊరట.. 2028 నాటికి మరింత తగ్గుదల
- గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి.. వీడని ఆదాయ అసమానతలు

మత్స్యకారుల సమస్యలపై చర్చ

- పడవలకు బీమా కల్పించే యోచన
- నష్టంపై పవన్ కల్యాణ్ సమీక్ష
- ఉప్పాడ రక్షణ గోడ పనులు వేగవంతం
- కాకినాడలో విద్యుత్ అంతరాయం
- ఉప్పాడలో భారీగా తీర కోత
- బీచ్ రోడ్డు ధ్వంసం.. రాకపోకలు బంద్
- 54,435 హెక్టార్లలో పంట నష్టం
- 21 మండలాల్లో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

అమరావతి

అర్నబ్ తుపాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో జరిగిన నష్టం, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ పాల్గొన్నారు. జిల్లాలో తుపాను వల్ల జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు. "తీరప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి. వేట పడవలకు బీమా కల్పించే అంశంపై ప్రతిపాదనలు వివరాలు 2లో..

జనవరి 25 నుంచి జనగణన

- ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మినహాయింపు
- మార్చి 1 అర్ధరాత్రి కీలక గడువు
- జనవరి 10 నుంచే స్వీయ నమోదు
- రెండు దశల్లో జనాభా లెక్కింపు
- జనగణనకు రూ.11,718 కోట్ల కేటాయింపు
- కరోనా కారణంగా ఐదేళ్ల ఆలస్యం
- చివరిసారిగా 2011లో జనాభా లెక్కింపు

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

- చివరి శ్వాస వరకు ప్రజాసేవ.. దేశం కష్టాల్లో ఉంటే సంబరాలా?
- ఎరువులు, గ్యాస్‌పై దుష్ప్రచారం.. రైతులపై ధరల భారం పడనివ్వం
- రైతు సంక్షేమమే లక్ష్యం.. పీఎం-కిసాన్‌కు రూ.4.5 లక్షల కోట్లు
- బనాస్కాంత రైతులపై ప్రశంసలు.. పశుసంవర్ధక రంగానికి ప్రోత్సాహం

తుపాను బాధితుల కష్టం తెలుసు..
ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

యుద్ధప్రాతిపదికన చేపట్టి, వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన పర్యటనలో భాగంగా, రెండో రోజైన శుక్రవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.

పంటల బీమాతోనే రైతుకు ధీమా

నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన వరి పంట పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. "ప్రకృతి వైపరీత్యాలు మన చేతుల్లో లేవు. కానీ, నష్టం జరిగినప్పుడు బీమా ఉంటే రైతుకు ఆర్థికంగా భరోసా ఉంటుంది. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీకి అదనంగా బీమా పరిహారం రైతుకు అండగా నిలుస్తుంది" అని వివరించారు. పంట కాలువల్లో పూడిక కారణంగా నీటి ప్రవాహం సరిగా లేక పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని, త్వరలోనే పనులు ప్రారంభించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు దృష్టి సారిస్తే, పంటలకు మంచి డిమాండ్ వస్తుందని, ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు.

నేలకొరిగిన 15 వేల విద్యుత్ స్తంభాలు

తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, ఇది విద్యుత్ సరఫరాకు పెను సవాలుగా మారిందని సీఎం తెలిపారు. "రేపు సాయంత్రానికల్లా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం. తొలుత గృహ అవసరాలకు, ఆ తర్వాత వ్యవసాయానికి విద్యుత్ అందిస్తాం" అని ప్రకటించారు. అవసరమైతే తెలంగాణ నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పించి పనులు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సహకరించి వారిలో స్ఫూర్తి నింపారు. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిని, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు కూలిపోయాయని, వాటిని తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడిందని, వాటిని కూడా త్వరగా పునరుద్ధరిస్తామని తెలిపారు.

షెల్టర్లలో బాధితులకు భరోసా.. మత్స్యకారులకు హామీ

అనంతరం మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుపాను పునరావాస కేంద్రాన్ని (షెల్టర్) ముఖ్యమంత్రి సందర్శించారు. గత నాలుగు రోజులుగా అక్కడే ఆశ్రయం పొందుతున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులతో మాట్లాడారు. తుపాను తీరం దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపామని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని బాధితులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, "ప్రభుత్వం ముందుగానే హెచ్చరికలు జారీ చేసి, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. మీ ప్రాణాలకు మాది భరోసా" అని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వశిష్ట గోదావరి ముఖద్వారం వద్ద పూడిక సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల వేటకు వెళ్లడం కష్టంగా మారిందని మత్స్యకారులు సీఎం దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన, సముద్ర ముఖద్వారం వద్ద పూడికను తొలగించి, మత్స్యకారులు సులభంగా వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

రూ.4,600 కోట్ల నష్టం.. కేంద్ర బృందం పర్యటన

షెల్టర్ సందర్శన అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. 'అర్నబ్' తుపాను ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించానని, ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలనిచ్చాయని అన్నారు. "రాత్రంతా సమీక్షలు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశాం. గతంతో పోలిస్తే ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గించగలిగాం. అయినప్పటికీ, దురదృష్టవశాత్తూ ఏడుగురు మరణించడం బాధాకరం" అని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామని తెలిపారు. తుపాను వల్ల ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రానికి రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లిందని, ఈ మేరకు కేంద్రానికి నివేదిక పంపామని చెప్పారు. పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేసి మరో నివేదిక అందిస్తామని, నష్ట తీవ్రతను పరిశీలించేందుకు కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తోందని వెల్లడించారు.

బాధితులకు నిత్యావసరాలు, రైతులకు నిధులు

తుపాను కష్టకాలంలోనూ రైతులకు అండగా నిలుస్తూ, పీఎం కిసాన్--అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేశామని సీఎం ప్రకటించారు. తుపాను బాధిత కుటుంబాలకు బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సహాయక శిబిరాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ అందేలా చర్యలు తీసుకున్నామని, తుపాను వల్ల నష్టపోయిన చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం బాధితులకు ఆయన స్వయంగా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

ఏలూరు మేయర్ పీఠం కోసం హోరాహోరీ

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల్లో అమలులోకి వచ్చిన ప్రత్యక్ష ఎన్నికల విధానంతో ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠం కోసం హోరాహోరీ సమరం నడుస్తోంది. కూటమి పొత్తు ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన ఈ మేయర్ స్థానానికి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలవగా.. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గంటా మోహన్ రావు ప్రత్యర్థిగా తలపడుతున్నారు. కూటమి అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికి స్థానిక రాజకీయాల్లో దశాబ్దాల క్షేత్రస్థాయి అనుభవం అతిపెద్ద బలం. గతంలో సుదీర్ఘకాలం టీడీపీలో ఉండి, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఆయనకుంది. 2019 నుంచి ఏలూరు జనసేన ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ పార్టీ కేడర్‌ను నిర్మించడంతో పాటు, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్‌గా కార్మిక, ప్రజా సంఘాలతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. దీనికితోడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చరిష్మా, టీడీపీ-జనసేన సంప్రదాయ కాపు, బీసీ, బలిజ ఓటు బ్యాంకు ఒక్కతాటిపైకి రావడం ఆయనకు కొండంత అడ్వాంటేజ్. అయితే, ఏలూరు మేయర్ సీటు తమకే కావాలంటూ ప్రారంభంలో స్థానిక టీడీపీ కేడర్, ఆశావహులు వ్యక్తం చేసిన తీవ్ర అసంతృప్తి, ఎమ్మెల్యే బడేటి చంటి వర్గంతో సమన్వయం సాధించడంలో తొలుత ఎదురైన అంతర్గత అసంతృప్తి అప్పలనాయుడికి కొంత ప్రతిబంధకంగా మారాయి. మరోవైపు వైసీపీ అభ్యర్థి గంటా మోహన్ రావు కూడా నగరంలో బలమైన ఆర్థిక, సామాజిక వనరులున్న నాయకుడిగా బరిలోకి దిగారు. నగరంలోని బీసీ వర్గాలతో పాటు, సంప్రదాయంగా వైసీపీ వెన్నంటి నిలిచే మైనార్టీ, ఎస్సీ , కొన్ని కార్మిక వాడల ఓటు బ్యాంకుపై ఆయన ప్రధానంగా ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమలైన సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుస్తూ, ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రచారం చేస్తూ కేడర్‌ను మోహరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, గత మున్సిపల్ పాలకవర్గంపై ఏలూరు ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత, గతంలో నగరంలో తాగునీటి కాలుష్యంతో పదుల సంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురైన చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ నగరవాసుల మదిలో ఉండటం వైసీపీకి అతిపెద్ద మైనస్. అదీగాక, ఓటమి భయంతో నగరానికి చెందిన మాజీ మంత్రులు, కీలక వైసీపీ నేతలు ప్రచారానికి మొహం చాటేయడం, ఆయనకు పూర్తిస్థాయి అంగబలం కరువవ్వడం ప్రధాన బలహీనతగా మారింది. ఈ ఎన్నికల్లో డివిజన్ల స్థాయిలో కార్పొరేటర్ అభ్యర్థుల బలం మేయర్ పోరును ప్రత్యక్షంగా శాసిస్తోంది. నగరంలోని 62 డివిజన్లలో దాదాపు అన్ని చోట్లా కూటమి శ్రేణులు ముందస్తుగా సమన్వయ కమిటీలు వేసుకుని, బూత్ లెవల్ ప్రచారంలో స్పష్టమైన పైచేయి సాధించాయి. గతంలో తమ మధ్య ఉన్న అసంతృప్తులను పక్కనబెట్టి.. టీడీపీ ఎమ్మెల్యే బడేటి చంటి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, జనసేన నేతలు ఏకతాటిపైకి వచ్చి అప్పలనాయుడి తరఫున ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోవైపు, వైసీపీకి చాలా డివిజన్లలో సమర్థులైన కార్పొరేటర్ అభ్యర్థులే దొరక్కపోవడం, బరిలో ఉన్నవారు సైతం సొంత ఖర్చులతో రిస్క్ తీసుకోలేక చతికిలపడటం మేయర్ అభ్యర్థి గంటా మోహన్ రావుకు క్షేత్రస్థాయిలో గొడ్డలిపెట్టుగా మారింది. సామాజిక సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే.. ఏలూరు నగరంలో దాదాపు 60 శాతానికి పైగా ఉన్న బీసీ, కాపు, వైశ్య, ఉద్యోగ వర్గాలు కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఎజెండా, పెన్షన్ల పెంపు, దీపం-2' వంటి సంక్షేమ పథకాల వైపే స్పష్టంగా మొగ్గుచూపుతున్నాయి. అప్పలనాయుడికున్న క్లీన్ ఇమేజ్, స్థానిక నాయకత్వ పట్టు ఆయనకు సాధారణ తటస్థ ఓటర్లలోనూ ఆదరణ తెచ్చిపెడుతోంది. వైసీపీ కేవలం తమ పాత సంప్రదాయ ఓట్లను మాత్రమే నిలుపుకోగలుగుతుండగా, కొత్తగా ఓటర్లను ఆకర్షించే అంశాలేవీ ఆ పార్టీ వద్ద లేకపోవడం ప్రచారంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మేయర్ ప్రత్యక్ష పోరులో కూటమి-జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికే దాదాపు 65 నుంచి 70 శాతం మేర స్పష్టమైన విజయావకాశాలు కనిపిస్తున్నాయి. టికెట్ కేటాయింపు సమయంలో తలెత్తిన విభేదాలను అధిగమించి కూటమి శ్రేణులు ఏకతాటిపైకి రావడం ఆయనకు అతిపెద్ద రక్షాకవచంగా మారింది. దీంతో గంటా మోహన్ రావు గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుని, అక్కడ జనసేన జెండా ఎగరడం దాదాపు లాంఛనమేనని అనుకోవచ్చు.

నవంబర్ 20 వరకు గడువు పొడిగింపు

-మొదటిపేజీ తరువాయి

ప్రక్రియకు జూలై ఒకటి అర్హత తేదీగా పరిగణిస్తూ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా జూలై 31న ప్రకటించామన్నారు. అక్టోబర్ 22 వరకు క్లెయిమ్?లు, అభ్యంతరాలను స్వీకరించి 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని తొలుత నిర్ణయించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులతో నవంబర్ 20 వరకు క్లెయిమ్‌లను, అభ్యంతరాలు తీసుకోనున్నట్టు వివరించారు. నవంబర్ 30న సర్ పూర్తయ్యాక ఓటర్ల జాబితాలను వెల్లడిస్తామని వివేక్ యాదవ్ తెలిపారు.

6 రాష్ట్రాల్లో సవరణ

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో పారదర్శకత పెంచడం, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు, డూప్లికేట్ ఓట్లను గుర్తించడం లక్ష్యంగా ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ చేపట్టింది. ఇప్పటికే బిహార్, బంగాల్, తమిళనాడు, కేరళం, ఉత్తర్?ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ముగిసింది ప్రస్తుతం మూడో దశలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దిల్లీ, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్‌లలో ఈ ఏడాది మే 14న సర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ దశ పూర్తయితే జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, లద్దాఖ్ మినహా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ పూర్తైనట్లు అవుతుంది.

ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల అభ్యర్థనల మేరకు గడువు పొడిగించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్‌లలో నవంబరు 30న తుది జాబితా ప్రచురించనున్నారు. ఈ మేరకు సవరించిన షెడ్యూల్?పై కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దిల్లీలో మాత్రం డిసెంబరు 12 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించారు. ఓటర్ల తుది జాబితాను డిసెంబరు 22న విడుదల చేయనున్నారు. ఈ దశ పూర్తయితే జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, లద్దాఖ్ మినహా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తవుతుంది.

మత్స్యకారుల సమస్యలపై చర్చ

-మొదటిపేజీ తరువాయి

సిద్ధం చేయాలి. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన ఉంటుంది. ఉప్పాడ తీరప్రాంత రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలి. మత్స్యకారుల సమస్యలపై స్వయంగా అధ్యయనం చేస్తా." కాకినాడను అతలాకుతలం చేసిన అర్నబ్ : అర్నబ్ తుపాను కాకినాడ నగరాన్ని అతలాకుతలం చేసింది. తుపాను ప్రభావంతో వీచిన భారీ ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగి విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తుపాను ప్రభావం తగ్గి మూడు రోజులు గడుస్తున్నా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఇంకా పూర్తిస్థాయిలో పునరుద్ధరణ కాలేదు. మూడు రోజులుగా కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో అలల తాకిడికి తీరం కోతకు గురైంది. ఇటీవల ఎత్తుగా నిర్మించిన రాళ్లగట్టును సైతం అలలు దాటుకుని విరుచుకుపడ్డాయి. ఉప్పాడ సమీపంలోని కొత్తపట్నం, కొత్తపేట, పల్లిలపేట, సుబ్బంపేట, రంగంపేటతో పాటు ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్ రోడ్డు చాలా ప్రదేశాల్లో పూర్తిగా దెబ్బతింది. రాకపోకలు స్తంభించిపోయాయి.

54,435 హెక్టార్లలో పంటలు నష్టం

మరోవైపు అర్నబ్ తుపాన్ రైతన్నల ఆశలను గల్లంతు చేసింది. కాకినాడ జిల్లాలో కురిసిన వర్షం, బలమైన ఈదురుగాలుల కారణంగా జిల్లాలో 54,435 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ పంటలకు సంబంధించి 4,183 హెక్టార్లలో వరి, 720 హెక్టార్లలో మినుము, అయిదు హెక్టార్లలో పత్తి, రెండు హెక్టార్లలో పెసర పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 21 మండలాల పరిధిలోని వ్యవసాయ పంట నష్టాల అంచనాపై గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కొన్నిచోట్ల పంట పూర్తిగా నీటమునగగా, మరికొన్ని ఈదురుగాలుల వల్ల పడిపోయినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా

-మొదటిపేజీ తరువాయి

ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చింది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరింది.

12,244 కేంద్రాల్లో 1న పోలింగ్

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభవుతుంది. 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని కార్పొరేషన్లు, మున్సిపల్ కార్యాలయాలకు అధికారులు పంపించారు. వీటిని ఈనెల 31న పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించనున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో నామినేషన్? వేసిన అభ్యర్థులు ప్రచారాలు ముమ్మరంగా చేస్తున్నారు. చాలా చోట్ల కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ ప్రక్రియలో వైఎస్సార్సీపీ చతికిలబడిందని రాజకీయ నిపుణులు వెల్లడిస్తున్నారు.

మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట

రాజమండ్రి : వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం వల్ల నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా, దేశీయంగా పెరిగిన ద్రవ్యోల్బణ భారాన్ని సామాన్యులపై పడకుండా నిరోధించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే దీపావళి పండుగ నుంచే రాష్ట్రంలోని పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువులను మార్కెట్ ధరల కంటే సగానికి పైగా తక్కువ రేటుకే అందుబాటులోకి తేవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు.ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్,మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

తుఫాను నష్టాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొన్నాం

ప్రాణనష్టాన్ని భారీగా తగ్గించగలిగాం.. విద్యుత్ సరఫరాను త్వరలో పునరుద్ధరిస్తాం

తుఫాను మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

పెన్ పవర్ -- పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు, అక్టోబర్ 30:మొగల్తూరు: అర్నబ్ తుఫాను ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించామని, ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్‌ను సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేశామని, క్షేత్రస్థాయి సిబ్బందితో పలుమార్లు టెలికాన్ఫరెన్సులు నిర్వహించి అధికార యంత్రాంగాన్ని నిరంతరం అప్రమత్తం చేశామని వెల్లడించారు. రాత్రంతా సమీక్షలు నిర్వహిస్తూ తుఫాను హెచ్చరికలు జారీ చేయించామని తెలిపారు.గతంతో పోలిస్తే ప్రాణనష్టాన్ని భారీగా తగ్గించగలిగామని, అయినప్పటికీ దురదృష్టవశాత్తూ ఏడుగురు మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. తుఫాను కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని ముఖ్యమంత్రి తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ముందుగా గృహాలకు, అనంతరం వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని వివరించారు. అవసరమైన అదనపు సిబ్బందిని తెలంగాణ నుంచి కూడా రప్పిస్తున్నట్లు తెలిపారు.ప్రైవేటు టెలికాం ఆపరేటర్ల టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కమ్యూనికేషన్ వ్యవస్థలో అంతరాయం ఏర్పడిందని, సిగ్నల్ సమస్యలను పరిష్కరించి సేవలను త్వరితగతిన పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పశ్చిమగోదావరిలో 12,500 చెట్లు నేలకూలాయి

తుఫాను ప్రభావంతో ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే సుమారు 12,500 చెట్లు నేలకూలాయని, కొబ్బరి చెట్లు, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. కూలిన చెట్లను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని, మిగిలిన చెట్ల వ్యర్థాలను కూడా త్వరితగతిన తొలగిస్తామని తెలిపారు.పంటల బీమా చేయించుకున్న రైతులను అభినందిస్తూ, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీట మునిగిన పంటల రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని, తుఫాను కారణంగా నష్టపోయిన మత్స్యకారులకు కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రూ.4,600 కోట్ల నష్టం ప్రాథమిక అంచనా

తుఫాను కారణంగా ప్రాథమికంగా రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని ముఖ్యమంత్రి తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో వివిధ రిజర్వాయర్లు, చెరువులను నింపేలా చర్యలు చేపట్టామని వివరించారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని, ప్రజల భాగస్వామ్యంతో విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కోగలిగామని అన్నారు. క్షేత్రస్థాయిలో సేవలందించిన అధికారులను, సిబ్బందిని అభినందించారు.

ఇప్పటికే కోనసీమ జిల్లాలో పర్యటించానని, గురువారం నర్సాపురం ప్రాంతంలో పర్యటించి తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించానని ముఖ్యమంత్రి తెలిపారు. దెబ్బతిన్న ప్రాంతాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

పోలవరం జిల్లాలో 46,211 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

రూ.19.37 కోట్ల నగదు పంపిణీ.. తాళ్లపాలెంలో పంపిణీ తీరును పరిశీలించిన కలెక్టర్

రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 30:పోలవరం జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని 46,211 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.19,37,16,500 (రూ.19.37 కోట్లు) పింఛన్ల నగదును పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేసేలా అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రంపచోడవరం మండలం తాళ్లపాలెం గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి పింఛన్ల నగదు అందుతున్న తీరును, పంపిణీ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పింఛను అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీ సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ ప్రక్రియ చేపట్టాలని, ఈ మేరకు సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో పీడీ డీఆర్‌డీఏ–సెర్ప్ దాసరి రత్నకర్ రావు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాను ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు రూరల్ మండలం పరిశీలించిన బాబ్జి

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) అర్నబ్ తుఫాను ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు రూరల్ మండలం నవాబుపాలెం, కొత్తూరు, కృష్ణయ్య పాలెం గ్రామాలలో తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు స్వామి, ముత్యాల సత్యనారాయణ, మద్దుకూరి ధనరాజ్, పద్మనాభుని మురళి, చంద్రు రాంబాబు, దేవల సుబ్బారావు, గన్నవరపు రాంకుమార్, ముప్పిడి రమేష్, వెలిగట్ల రాము, మరియు గ్రామ రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కొడు అమలులో ఉన్నా జోరుగా బెల్ట్ దందా

ఇళ్ల మధ్య లోనే మద్యం దుకాణం

కుక్కునూర్ పెన్ పవర్ అక్టోబర్ 30 :ఏలూరు జిల్లా కుక్కునూర్ మండలంలో పంచాయతీ ఎన్నికలు వేడెక్కుతున్న వేళలో ఒక పక్కన ఎన్నికల కొడుకు అమలు లో ఉన్న బెల్ట్ దందా జోరుగా సాగుతుంది, విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి, గ్రామపంచాయతీలో గల్లీకి ఒకటి రెండు బెల్ట్ షాపులు చొప్పున ఉన్నాయి, గ్రామంలో మద్యం విక్రయాలు అధికంగా జరగడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి, ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగడంతో బెల్ట్ షాపులో మద్యం ఏరులైపారుతుంది, ఒక పక్కన బెల్ట్ షాపులు నడిపేందుకు అనుమతులు లేవని అధికారులు చెబుతున్న అధికారుల మాటను లెక్క చేయకుండా జోరుగా బెల్టు దందా సాగిస్తున్నారు, ఎమ్మార్పీ దరకే విక్రయించేలా,కల్తీ మద్యం అరికట్టేలా, చర్యలు చేయబడుతున్న క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు దీంతో బెల్ట్ షాపు నిర్వాహలకు హద్దు లేకుండా పోతుంది, ఫలితంగా వారి వ్యాపారం మూడు క్వాటర్లు ఆరు బీర్లు లా కొనసాగుతుంది, బెల్ట్ షాపులు అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటున్నాయి, ఒక పక్కన ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా గాని బెల్ట్ షాపులు అర్ధరాత్రి వరకు నడుస్తున్న గాని అధికారులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది, ఊరు బయట ఉండాల్సిన మద్యం దుకాణం ఇళ్ల మధ్యలో ఉండటం దానిని అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు దారితీస్తుంది, ఇప్పటికైనా అధికారులు ఊరు బయట మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసి ఆ మద్యం దుకాణం చుట్టుపక్కల ఉన్న ప్రజలకు మేలు చేయగలరని ప్రజలు కోరుకుంటున్నారు.

అర్నబ్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొన్న జిల్లా యంత్రాంగం

జిల్లాలో సుమారు 100 మి.మీ. వర్షపాతం నమోదు.. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు

24 గంటల పాటు అప్రమత్తంగా పనిచేసిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది

మీడియా సహకారం అభినందనీయం: జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 30:అర్నబ్ తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం, వివిధ శాఖల మధ్య సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టడం ద్వారా పోలవరం జిల్లాలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా తుఫానును సమర్ధవంతంగా ఎదుర్కొన్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. తుఫాను సమయంలో జిల్లా యంత్రాంగం మొత్తం 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టిందని వెల్లడించారు.శుక్రవారం రాత్రి రంపచోడవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుఫాను ప్రభావం, ముందస్తు ఏర్పాట్లు, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనుల వివరాలను కలెక్టర్ మీడియాకు వివరించారు.జిల్లాలో అర్నబ్ తుఫాను ప్రభావంతో సుమారు 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు. తుఫాను ముప్పును దృష్టిలో ఉంచుకుని ముందుగానే అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి అవసరమైన సహాయక చర్యలకు సిద్ధం చేశామన్నారు. జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించామని పేర్కొన్నారు.

తుఫాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, రహదారులపై చెట్లు నేలకొరగడం వంటి సమస్యలు ఎదురైనప్పటికీ సంబంధిత శాఖల సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రహదారులపై పడిన చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రత్యేక బృందాలు పనిచేశాయని వివరించారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు

తుఫాను సమయంలో గర్భిణీ స్త్రీలకు ఎలాంటి వైద్యపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా గర్భిణులను గుర్తించి, అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు సంబంధిత ఆసుపత్రుల్లో ముందుగానే చేర్పించామని వెల్లడించారు. అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశామన్నారు.వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల తుఫాను సమయంలో ఎదురైన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించగలిగామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి, ప్రజలకు, పాత్రికేయులకు జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తుఫాను వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు సకాలంలో సమాచారం అందించడం ఎంతో కీలకమని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

అనుమతి జిం2 కే. నిర్మాణం జిం4!

కళ్లు మూసుకున్న ప్రత్యేకాధికారి....!!!!

గ్రామ నడిబొడ్డున ఆర్‌డబి స్థలాన్ని ఆనుకుని అక్రమ నిర్మాణం – చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం.

నాకు అవసరం లేదు మీరు కావాలంటే ఫిర్యాదు చేయండి అంటున్నారు ప్రత్యేక అధికారి...???

గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 30:–గోకవరం మండలం కామరాజుపేట గ్రామంలో ఓ భారీ నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఆర్‌డబి ప్రధాన రహదారిని ఆనుకుని,రోడ్డు మీద వెళ్లే ప్రతి ఒక్కరికీ కనిపించేలా జిం4 అంతస్తుల పక్కా భవన నిర్మాణం జరుగుతుండగా, దాన్ని అడ్డుకోవాల్సిన పంచాయతీ ప్రత్యేకాధికారి మాత్రం "నాకు సంబంధం లేదు" అంటూ చేతులు దులుపుకోవడం పలు విమర్శలకు దారితీస్తోంది.

అనుమతి ఒకటి... కడుతున్నది మరొకటి..

స్థానికుల సమాచారం ప్రకారం ఈ భవనానికి గ్రామ పంచాయతీ నుండి జిం2 వరకు మాత్రమే అనుమతి ఉన్నట్లు కానీ నిర్మాణదారుడు నిబంధనలను ఉల్లంఘించి జిం4 వరకు శ్లాబులు వేశారు. గ్రామీణ ప్రాంతంలో జిం4 నిర్మాణానికి అసలు అనుమతే ఉండదని, ఒకవేళ ఉన్నా అగ్నిమాపక, టౌన్ ప్లానింగ్ శాఖల నుండి ప్రత్యేక అనుమతులు తప్పనిసరని నిపుణులు చెబుతున్నారు. మరి బహిరంగంగా ఇంత భవనం నిర్మిస్తున్న అధికారులు తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చట్టం ఏం చెబుతోంది....?

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం – 1994 ప్రకారం

సెక్షన్ 114, 115 పంచాయతీ అనుమతి లేకుండా, అనుమతికి విరుద్ధంగా భవన నిర్మాణం చేపడితే అది నేరం. అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసే అధికారం పంచాయతీ కార్యదర్శి / ప్రత్యేకాధికారికి ఉంది. సెక్షన్ 128 అక్రమ నిర్మాణదారుడిపై జరిమానా విధించడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు. జీవో నెం. 75 గ్రామీణ ప్రాంతాల్లో జిం2 పైబడి నిర్మాణాలకు జిల్లా స్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి అనుమతి తప్పనిసరి కానీ దీనికి సంబంధించిన టౌన్ ప్లానింగ్ అధికార అనుమతి కూడా లేదనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

గ్రామ ప్రత్యేకాధికారి నిర్లక్ష్యపు సమాధానం...

ఈ నిర్మాణంపై కామరాజుపేట పంచాయతీకి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆర్ డబ్ల్యూ ఎస్ జే ఈ రామకృష్ణ తీరుపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. పంచాయతీ సందర్శనకు వెళ్లే దారిలోనే గ్రామ నడిబొడ్డిలో ఆర్ అండ్ బి రహదారిని ఆనుకుని ఈ భవనం స్పష్టంగా కనిపిస్తుంది దీనిపై గోకవరం మండల పెన్ పవర్ ప్రతినిధి ఆన్లైన్ లో వివరణ కోరగా నాకు మూడు పంచాయతీలు ఉన్నాయి ఏ పంచాయతీలో ఏం జరుగుతుందో చూసేంత తీరిక నాకు లేదు. మీకు ఇంట్రెస్ట్ ఉంటే ఫిర్యాదు చేయండి అప్పుడు చూస్తాను అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. గ్రామస్తులు కూడా కొంతమంది ఫిర్యాదు చేయగా వారికి కూడా ఇలాగే సమాధానం చెప్పడంతో ఏమిటి ఈ అధికారి తీరని కనీసం జిల్లా అధికారులైన ఈ అధికారి తీరుపై స్పందించాలని కోరుతున్నారు. అస్సలు ప్రత్యేకాధికారి అంటేనే పంచాయతీ పాలన, అక్రమాల నివారణ బాధ్యత వహించాల్సిన వ్యక్తి. "నాకు తెలియదు" అని చెప్పడంపై స్థానికులు మండి పడుతున్నారు.

ఆ అధికారి తీరుపై గ్రామస్తులు అనుమానాలు :--

రోడ్డు పక్కనే ఇంత పెద్ద నిర్మాణం జరుగుతుంటే అధికారికి తెలియకపోవడం ఏంటని, దీని వెనుక భారీ లావాదేవీలు జరిగి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్ జోక్యం చేసుకుని ఈ అక్రమ నిర్మాణంపై విచారణ జరిపి, బాధ్యులైన అధికారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పనుల పురోగతిని వెబ్ సైట్ లో పొందుపరచాలి

ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30:నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పురోగతి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర చాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ లో ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'వర్క్ మానిటరింగ్ సిస్టం' అప్లికేషన్ పై అధికారులకు అవగాహన కల్పించారు. వర్క్ మానిటరింగ్ సిస్టం ద్వారా పనులలో పారదర్శకతతో పాటు వేగం పెరుగుతుందని కమిషనర్ అన్నారు. ఈ విధానం ద్వారా ఒక పనికి అంచనాలను సిద్ధం చేయడం నుంచి టెండర్లు పిలవడం, పనుల పురోగతి, బిల్లుల ఆమోదం వరకు ఏ దశలో ఉన్నాయో తెలుసుకోవడం సులభతరం అవుతుంద న్నారు. ప్రతి పని వివిధ దశల ఫోటోలను వెబ్ సైట్ లో సకాలంలో అప్‌లోడ్ చేయడం ద్వారా నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వెనుకబడిన పనులను సులభంగా గుర్తించి, నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ఈ వర్క్ మానిటరింగ్ సిస్టం ఉపయోగకరం

అవుతుందన్నారు. ప్రతి ఇంజనీరింగ్ అధికారి తమ పరిధిలోని పనుల రోజువారీ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను వెబ్ సైట్ లో తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఎస్ఈ రీటా, ఈఈలు మదర్షా అలీ, మాధవి, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన పై మాజీ ఎంపీ మార్గాని భరత్ ఫిర్యాదు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30: క్వారీ ప్రాంతంలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం, అభివృద్ధి పనులపై హామీలతో కరపత్రాల పంపిణీ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని ఆరోపిస్తూ మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ మార్గాని భరత్ రామ్ జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా కు ఫిర్యాదు చేశారు. జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఈ ఉల్లంఘన పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాజకీయ బృందం క్వారీ ప్రాంతంలో ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తోందని భరత్ ఆరోపించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో నిర్దిష్ట హామీలు ఇవ్వడం 8(బి), 8(సి), 9 (ఎ) ప్రకారం నిబంధనలకు విరుద్ధమ న్నారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నట్లు ఫిర్యాదులో వివరించారు. నగరంలోని చెత్తను పెద్దాపురంలోని రిలయన్స్ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్‌కు తరలించే ఏర్పాట్లు ఖరారైనట్లు కరపత్రంలో ప్రకటించారని తెలిపారు. కరపత్రం ప్రచురణ నియమా వళిలోని నిబంధనల ప్రకారం ముద్రణ సంస్థ, ప్రచురణకర్త పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలని అయితే, సంబంధిత కరపత్రంలో ఈ వివరాలు లేవని, 'ప్రింటెడ్ బై లక్ష్మీ సి అనే అసంపూర్ణ సమాచారం ఉందని ఆరోపించారు.

ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని కరపత్రాలను స్వాధీనం చేసుకోవాలని మార్గాని కోరారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని, ఉల్లంఘన నిర్ధారణ అయితే తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల సమావేశాల సమాచారం వైసిపి కి అందడం లేదని , గత ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానని, ప్రస్తుతం ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. నగరం లో సామాజిక సర్వే సక్రమంగా జరగలేదని సచివాలయా ల్లోనూ, కమ్యూనిటీ హాల్లో కూర్చుని ఈ సర్వే పూర్తి చేసారణి కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. నగరపాలక ఎన్నికలకు అన్ని డివిజన్ల ఓటర్ల జాబితాలను ఫోటోలతో సహా వైసిపికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట వైసీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి విద్యార్థులు కృషి చేయాలి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30:మై భారత్ ఈస్ట్ గోదావరి ఆధ్వర్యంలో నైబర్హుడ్ యూత్ పార్లమెంట్ ను నషాముక్త్ భారత్ అనే అంశం మీద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈస్ట్ గోదావరి జిల్లా ఈగల్ టీం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వి సూర్య మోహన్ రావు విచ్చేసి విద్యార్థులకు డ్రగ్స్ రహిత సమాజం నిర్మించడం పై వివరించారు. విద్యార్థులు సమాజం పట్ల పూర్తి అవగాహనను కలిగి ఉండాలని, నవభారత నిర్మాణానికి యువత ముఖ్యమని, భవిష్యత్తు దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని దుర అలవాట్లకు దూరంగా ఉండలన్నారు. యువత డ్రగ్స్ కు బానిసలుగా మారి వారి భవిష్యత్తును కోల్పోతున్నారని, సమాజం అనుమతించని పనులను చేయడం, చట్టాలను ఉల్లంగించడం, డ్రగ్స్ కు బానిసగా మారుతున్నా రన్నారు. డ్రగ్స్, సంబంధిత కార్యకలాపాలలో ఉన్నట్లు సమాచారం ఉంటే, వెంటనే 1972 కు అందజేయాలని, నవభారత నిర్మాణంలో ముఖ్యమన్నారు. ప్రభుత్వాలతో పాటు, విద్యార్థులు పౌరుల మీద ఉన్నదన్నారు. ఈగల్ టీం ఎస్సై నరేష్ కుమార్ విద్యార్థులు దుర వ్యసనాలకు బానిస అవకుండా కుటుంబానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి రామకృష్ణ, కళాశాల మేనేజ్మెంట్ విభాగాధిపతి కే. రాజు, అధ్యాపకులు కె.వి రాజేష్ కుమార్ మరియు వి. హిమజ, ఏబీవీపీ సత్య, లైబ్రేరియన్ రవికుమార్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జాయింట్ కలెక్టర్

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో పింఛన్ అందించాలి

జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

గంగవరం పెన్ పవర్ అక్టోబర్ 30:గంగవరం మండలంలోని పాత గంగవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పింఛన్ల పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించి, లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న విధానంపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నిర్ణీత సమయంలో పింఛన్ నగదు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పంపిణీ ప్రక్రియలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రభుత్వం సామాజిక భద్రతలో భాగంగా అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన వారికి ఆర్థిక భరోసాగా నిలుస్తున్న నేపథ్యంలో పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర, ఏపీఎం అప్పలకొండ, డీఆర్డీఏ ప్రతినిధులు మధుబాబు, సత్యప్రసాద్, ఎఫ్టీవో గణపతి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో వైసీపీ కి రాజకీయ విమర్శలు సరికాదు

మీడియా సమావేశంలో నగర కూటమి నేతలు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30:తుపాను వంటి విపత్కర పరిస్థితుల్లో రాజకీయాల కతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షాలకు ఉందనినగరానికి చెందిన కుటమి నాయకులు అన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, ఫేక్ వీడియోలతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం సరికాదని వైసీపీ నాయకులకు వారు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశంలో నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, జనసేన పార్టీ నగర అధ్యక్షులు యర్రాగుల శ్రీను మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రజా సమస్యలపై నిర్మాణా త్మకంగా స్పందించి పరిష్కారానికి సహకరిం చాలని కోరారు.అర్నాబ్ తుపాను సమయంలో అధికారులను సమన్వయం చేసి ప్రజలకు సహాయక చర్యలు చేపట్టి, విద్యుత్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిం చడంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యవహరిం చారన్నారు.

సహాయక చర్యలను చేసిన ఎమ్మెల్యే సేవలు అభినందనీయమన్నారు. అభివృద్ధి పనులపై బురదజల్లడం సరి కాదని వైకాపా నాయకులకు సూచించారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం, నగరం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా వాటర్ పైప్‌లైన్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్స్ కోసం రోడ్లు తవ్వాల్సి వస్తోందని, తాత్కాలిక ఇబ్బందులను చూపించి అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలవడం బాధ్యతన్నారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే చర్యలు చేపడుతున్నారని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో కూటమి నాయకులు ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రవి, , కంటిపూడి శ్రీనివాస్, అడబాల రామకృష్ణ, జామి సత్యనారాయణ, రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుల కష్టాలలో అండగా నిలిచిన స్నేహం...

గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 30:- దాసరి చిన్న ధర్మరాజు జిల్లా పరిషత్ హై స్కూల్ 2005 - 06 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు ఇటీవల ఆత్మీయ సమావేశం ఏర్పరచుకున్నారు.ఈ సమావేశంలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఉదయం నుండి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.సాయంత్రం వేళల్లో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకునే క్రమంలో ఒక ఇద్దరి స్నేహితుల మనసులో బాధను తోటి స్నేహితులు గుర్తించారు.విషయం ఏమిటనే దానిపై తోటి స్నేహితులు ఆరా తీయగా వారి కష్టాలను తోటి స్నేహితులను కుటుంబ సభ్యులుగా భావించి వివరించారు. వెంటనే తోటి స్నేహితుల కష్టాలను తమ కష్టాలుగా భావించి చిన్ననాటి స్నేహితులైన వారందరూ తమ ఉదార స్వభావాన్ని చాటారు. స్నేహమంటే ఆటలు, పాటలు, సినిమాలు, షికార్లు మాత్రమే కాదని స్నేహితుడికి ఆపద వస్తే స్నేహమే వారికి అండగా నిలవాలని సదుద్దేశంతో కష్టాల్లో ఉన్న తమ స్నేహితులకు ఆర్థిక సహకారం అందించారు. తమ చిన్ననాటి స్నేహితులైన సుబ్బలక్ష్మి అనారోగ్యం తో బాధపడుతుండడంతో ఆమె వైద్య ఖర్చులకు 40 వేల రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందించారు. మరొక మిత్రుడు ఎడ్ల వీరబాబు ఆర్థిక పరిస్థితి బాగో లేకపోవడంతో తనకు పదివేల రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ విధంగా చిన్ననాటి స్నేహితుల కష్టాలలో అండగా ఉంటూ 2005 - 06 సంవత్సరానికి చెందిన పూర్వపు విద్యార్థులు "స్నేహమంటే ఇదేరా" అంటూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. ఈ స్నేహితులు చేసిన మంచి పనికి గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు ప్రశంసించారు. అంతేకాకుండా తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతు బాధ్యతగా కలర్ ప్రింటర్ మరియు ఇన్వెర్టర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సత్కరించారు.. ఈ కార్యక్రమంలో పదవ తరగతి 2005 - 06 సంవత్సరం పూర్వ విద్యార్థులు, హై స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే నైతిక హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

- **రెండున్నరేళ్ల కూటమి పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలి**
- **మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**

సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 30:స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ఉందని రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా పేర్కొన్నారు. గురువారం సీతానగరంలో పెందుర్తి దేవదాసు స్వగృహం వద్ద

నిర్వహించిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడారు.

గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లుఅడుగుతామన్నారు. రెండున్నరేళ్ల కూటమి పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పి ఎన్నికల్లో ఓట్లు అడగాలని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. ఎరువుల కోసం రైతులు క్యూ లైన్లలో నిలబడాల్సిన దౌర్భాగ్య పరిస్థితి కూటమి పాలనలో నెలకొందన్నారు. పండించిన ధాన్యం సకాలంలో విక్రయించుకోలేక, మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనివిమర్శించారు. 25 వేల ఎకరాల పంట పొలాల ముంపు నివారణకు ఉద్దేశించిన రివర్స్ పంపింగ్ స్కీమ్‌ను వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరు చేస్తే, కూటమి ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలని వ్యాఖ్యానించారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో విద్యార్థులకు సుమారు రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.3,500 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో పేదలు వైద్య సేవలకు దూరమవుతున్నారనివిమర్శించారు.వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా ఎలాంటి సిఫార్సులు లేకుండా డీబీటీ విధానంలో సంక్షేమ పథకాలను అందించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు ఏడు లక్షల పెన్షన్లను తొలగించిందని ఆరోపించారు. 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి, ఒకటి రెండు సిలిండర్లతోనే సరిపెట్టిందని విమర్శించారు. ఇంటింటికీ రేషన్ అందించే పథకాన్ని సైతం నిలిపివేసిందన్నారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం

రాజానగరం నియోజకవర్గంలో రూ.215 కోట్లతో తాగునీటి ప్రాజెక్టును మంజూరు చేయడంతో పాటు, గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టామన్నారు. రెండున్నరేళ్లుగా ఈ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఈ సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, జడ్పీటీసీ అభ్యర్థి కరుటూరి శ్రీహరిబాబు, ద్వారంపూడి రామకృష్ణ, పెద్దపాటి రమేష్‌బాబు, పిచ్చుకల విజయ్ కుమార్, కొండ్రుపు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కౌలు రైతు బలి

వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా విషాదం..

పెన్ పవర్ పెంటపాడు మండలం, బోడపాడు అక్టోబర్ 30:పెంటపాడు మండలం బోడపాడు గ్రామంలో పిడుగుపాటు తీవ్ర విషాదాన్ని నింపింది. పిడుగుపాటుకు గురై కౌలు రైతు పాల రాంబాబు (55) మృతి చెందాడు.వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో రాంబాబు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ ఘటనను గమనించిన తోటి రైతులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాంబాబు మృతి



చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.కష్టపడి వ్యవసాయం చేసుకునే కౌలు రైతు అకాల మరణంతో బోడపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు విశేష స్పందన

- 2024తో పోలిస్తే 2026లో 110.99 శాతం దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పటివరకు 707 ఫారం-19 దరఖాస్తులు అందాయి
- నవంబర్ 3 చివరి గడువు.. నవంబర్ 9న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన

రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 30:పోలవరం జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు విశేష స్పందన లభిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. 2024లో నిర్వహించిన తుది ఓటరు జాబితాలో 637 మంది ఓటర్లు ఉండగా, 2026 సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 707 ఫారం-19 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. గత ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ప్రస్తుతం 110.99 శాతం దరఖాస్తులు నమోదయ్యాయని పేర్కొన్నారు.జిల్లావ్యాప్తంగా అందిన 707 దరఖాస్తుల్లో 648 దరఖాస్తులను ఎన్నికల నమోదు అధికారికి (ఈఆర్వో) సమర్పించగా, మిగిలిన 59 దరఖాస్తుల పరిశీలన, సమర్పణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ వివరించారు.

రంపచోడవరం డివిజన్‌లో 485 దరఖాస్తులు

రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అడ్డతీగలలో 80, దేవీపట్నంలో 53, గంగవరంలో 72, మారేడుమిల్లిలో 33, రంపచోడవరంలో 100, రాజవొమ్మంగిలో 122, వై. రామవరంలో 19, గూర్చేడులో 6 దరఖాస్తులు అందాయి. ఈ డివిజన్ పరిధిలో 2024 తుది జాబితాలో 526 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 485 దరఖాస్తులు స్వీకరించారు.

చింతూరు డివిజన్‌లో 222 దరఖాస్తులు

చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో చింతూరులో 89, కూనవరంలో 64, వీఆర్ పురంలో 42, యటపాకలో 27 దరఖాస్తులు అందాయి. ఈ డివిజన్ పరిధిలో 2024లో 111 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 222 ఫారం-19 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుత కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తుండగా, సహాయ రిటర్నింగ్ అధికారిగా పోలవరం జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శివరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు.అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు నవంబర్ 3వ తేదీ చివరి గడువుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నవంబర్ 9న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ఉపాధ్యాయులందరూ గడువులోగా ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

పెన పవర్ -- భీమవరం, అక్టోబర్ 30:భీమవరం: ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.శుక్రవారం భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ప్రతి నెలా సిబ్బంది సకాలంలో ఇళ్లకు వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నారా, లబ్ధిదారులతో గౌరవప్రదంగా వ్యవహరిస్తున్నారా అనే అంశాలపై ఆరా తీశారు.అలాగే లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితి, కుటుంబ సభ్యుల వివరాలు, పిల్లల చదువులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్ లబ్ధిదారులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ మొత్తాన్ని తమ అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిడదవోలు, మండపేట, కొవ్వూరు మున్సిపాలిటీల పరిధిలో స్థానికంగా సెలవు

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 30:నిడదవోలు, మండపేట, కొవ్వూరు మున్సిపాలిటీలకు జరుగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల పరిధిలో అక్టోబర్ 31, నవంబర్ 1, నవంబర్ 3 తేదీల్లో స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్‌కు ముందు రోజైన అక్టోబర్ 31న, పోలింగ్ రోజైన నవంబర్ 1న (ఆదివారం), ఓట్ల లెక్కింపు రోజైన నవంబర్ 3న ఈ స్థానిక సెలవులు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలోని పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు ఈ సెలవులు వర్తిస్తాయని తెలిపారు.ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ రోజున ఆయా ఉద్యోగులకు సెలవు ప్రకటించే విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ ఉత్తర్వులను సంబంధిత విద్యాసంస్థలకు తెలియజేయాలని ప్రాంతీయ ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు, ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ తనిఖీ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారిని , ఇతర సమన్వయ శాఖల అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఆటోను ఢీ కొట్టిన లారీ -- ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు.

గోకవరం కోరుకోండ పెన్ పవర్ అక్టోబర్ 30:-కోరుకొండ మండలం శివారు రోమ్ సిటీ గుర్రాలబొమ్మ సమీపంలో అతివేగంగా వచ్చిన లారీ ఎదురుగా వస్తున్న ఆటోని ఢీకొట్టిన సంఘటనలో అక్కడికక్కడే ఇద్దరు చనిపోగా ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి శుక్రవారం ఉదయం కోరుకొండ మండలం బురుగుపూడి గ్రామ శివారులోని గుర్రాల బొమ్మల సమీపం దగ్గర రంగంపేట మండలం ఈలకోలాను గ్రామానికి చెందిన పాల్లేటి అనిల్ కుమార్ (22) ఆటో నడుపుకుంటూ,తన ఆటో నంబర్ ఏపీ39 వివై 2831లో బెతుకూరి సుమలత, అంచూరి చిన్నరాజు, బెతుకూరి నాగేశ్వరరావు,బెతుకూరి మరియమ్మలతో కలిసి గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన ఏపీ16టీడీ9347 నంబర్ లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడటంతో ఆటో డ్రైవర్ పాల్లేటి అనిల్ కుమార్ (22) మరియు ప్రయాణికుడు అంచూరి చిన్నరాజు (40) తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారని. ఆటోలో ప్రయాణిస్తున్న మిగిలిన వారికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతుడు అనిల్ కుమార్ తండ్రి పాల్లేటి చిన్న వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ ప్రాణాంతకమని గుర్తించాలి. వాహనదారులు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడే బాధ్యత కలిగి ఉండాలని కోరుకొండ ఎస్ఐ ఆర్ శివాజీ ఈ సందర్భంగా కోరారు.

భీమవరం గ్రామంలో కలెక్టర్ కె. దినేష్ కుమార్ క్షేత్రస్థాయి పర్యటన

ప్రజలతో మమేకమై సమస్యలపై ఆరా.. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవల పరిశీలన

వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా కల్వర్టు నిర్మాణానికి చర్యలు

రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 30:ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడమే లక్ష్యంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ శుక్రవారం రంపచోడవరం మండలంలోని భీమవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజలు వెల్లడించిన సమస్యలను సావధానంగా విని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు.అనంతరం గ్రామ పరిధిలోని కాలువను పరిశీలించి, అక్కడ కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన అంశాలను సమీక్షించారు. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు, అత్యవసర సమయాల్లో గ్రామ ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా కల్వర్టు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని వి.బి.-జి-రామ్-జి (డీడబ్ల్యూఎంఏ) సిబ్బందిని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చట

భీమవరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వారికి అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీ-స్కూల్ విద్య, ఆటపాటలు, అభ్యసన కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, తాగునీటి సదుపాయం, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు.

చిన్నారుల సంపూర్ణ ఎదుగుదలకు పోషకాహారంతో పాటు నాణ్యమైన ప్రాథమిక విద్య, ఆహ్లాదకరమైన అభ్యసన వాతావరణం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవల్లో నాణ్యతను నిరంతరం కొనసాగించాలని, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- గంజాయి, నాటుసారా అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి
- తుఫాను బాధితులకు పోలీసుల సహకారం అందించాలి
- జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి

రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 30:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది ముందస్తు భద్రతా చర్యలు చేపట్టి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గంజాయి, నాటుసారా వంటి అక్రమ రవాణా కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.శుక్రవారం అడ్డతీగల సర్కిల్ పరిధిలోని దుచ్చెర్తి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, ఆవరణను పరిశీలించడంతో పాటు వివిధ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, విధుల అమలులో క్రమశిక్షణ పాటించాలని ఎస్సై, స్టేషన్ రైటర్‌కు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.అనంతరం ఏపీఎస్పీ డి కంపెనీ సిబ్బంది విధుల నిర్వహణ తీరును, వారి బ్యారెక్స్, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

పోలీసుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, మంచి ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని, విధి నిర్వహణలో ఉత్సాహంతో పనిచేయాలని తెలిపారు.

తుఫాను బాధితులకు అండగా నిలవాలి

ఇటీవల ఆర్నాబ్ తుఫాను కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో బాధితులకు పోలీసు సిబ్బంది తగిన సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ సూచించారు. ప్రభుత్వ సహాయక కార్యక్రమాలు అర్హులైన బాధితులకు చేరేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. నదులు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, నేలకొరిగిన చెట్ల వల్ల ప్రజలకు, వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రహదారులపై చెట్లు కూలడం లేదా ఇతర అడ్డంకులు ఏర్పడితే సంబంధిత శాఖల సహకారంతో వెంటనే తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఎస్‌బీ సీఐ భాను ప్రసాద్, అడ్డతీగల సీఐ ఎం. గజేంద్ర కుమార్, ఎస్సై కె. పార్థసారథి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయం, ప్రజల సహకారంతో అర్నబ్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

- జిల్లాలో ఎక్కడా ప్రాణనష్టం, పెద్దగా ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు
- 100 మి.మీ. వర్షపాతం నమోదు.. విద్యుత్, రహదారుల పునరుద్ధరణకు ప్రత్యేక బృందాలు
- ఘాట్ రోడ్లు, వాగుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం: కలెక్టర్ కె. దినేష్ కుమార్, ఎస్పీ కె. చక్రవర్తి

రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 30:అధికార యంత్రాంగం సమష్టి కృషి, వివిధ శాఖల మధ్య సమన్వయం, ప్రజల సహకారంతో అర్నబ్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. తుఫాను ప్రభావంతో జిల్లాలో సుమారు 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనప్పటికీ ముందస్తు జాగ్రత్తలు, నిరంతర పర్యవేక్షణ, సహాయక చర్యల కారణంగా ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా చూడగలిగామని పేర్కొన్నారు. తుఫాను సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా పనిచేశారని వివరించారు. శుక్రవారం రాత్రి రంపచోడవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ సంయుక్తంగా పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాను ప్రభావం, జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలు, పునరుద్ధరణ పనుల వివరాలను వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను హెచ్చరికలు వెలువడిన వెంటనే జిల్లావ్యాప్తంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. జిల్లా యంత్రాంగం 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించిందని తెలిపారు. తుఫాను కారణంగా విరిగిపడిన విద్యుత్ స్తంభాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అదేవిధంగా ఈదురుగాలులకు రహదారులపై నేలకొరిగిన చెట్లను ప్రత్యేక బృందాల ద్వారా వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో గర్భిణీ స్త్రీలను ముందుగానే గుర్తించి, వారికి ఎలాంటి వైద్యపరమైన ఇబ్బందులు తలెత్తకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో చేర్పించి ప్రత్యేక వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో తుఫాను పరిస్థితులను ఎదుర్కొన్నామని, ఈ కార్యక్రమంలో సహకరించిన ప్రజలకు, పాత్రికేయులకు జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసుల ప్రత్యేక చర్యలు

అర్నబ్ తుఫాను ప్రభావాన్ని పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, విద్యుత్ తదితర శాఖల సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి తెలిపారు. ముఖ్యమంత్రి తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు అవసరమైన ఆదేశాలు, సూచనలు ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర డీజీపీ కూడా నిరంతరం టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ జిల్లాల పరిస్థితులను సమీక్షించారని, అవసరమైన పోలీసు బలగాలు, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సహాయంపై మార్గనిర్దేశం చేశారని వివరించారు.

చెట్లు పడిన వెంటనే తొలగింపు.. రహదారుల పునరుద్ధరణ

తుఫాను సమయంలో ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో రహదారులపై చెట్లు పడిన వెంటనే ఆర్ అండ్ బీ, ఇతర శాఖల సిబ్బంది సంఘటనా స్థలాలకు చేరుకుని తొలగింపు చర్యలు చేపట్టారని చెప్పారు. తాను క్షేత్రస్థాయిలో పర్యటించే సమయానికే సుమారు 70 నుంచి 80 శాతం రహదారులపై చెట్ల తొలగింపు, క్లియరెన్స్ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందిన వెంటనే ప్రత్యేక బృందాలు స్పందించడం వల్ల రాకపోకలను త్వరితగతిన పునరుద్ధరించగలిగామని తెలిపారు.

ఘాట్ రోడ్లు, వాగుల వద్ద పోలీసు బందోబస్తు

తుఫాను సమయంలో ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎస్పీ వివరించారు. ప్రమాదకరమైన ఘాట్ రోడ్లలో ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు సూచించడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో భారీ వాహనాలను నిలిపివేసి రాకపోకలను నియంత్రించామని తెలిపారు. పోలీసుల సూచనలకు వాహనదారులు, ప్రజలు సహకరించడం అభినందనీయమన్నారు. పోలవరం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో వాగులు, వంకలు అధికంగా ఉన్నందున భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలవాటైన మార్గాలేనని నిర్లక్ష్యంగా ప్రవాహాలను దాటేందుకు ప్రయత్నిస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. అందువల్ల వాగులు, వంకలు, రహదారులు దెబ్బతిన్న ప్రాంతాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలను నియంత్రించినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది అప్రమత్తత, వివిధ శాఖల అధికారుల సమన్వయం, ప్రజల సహకారం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తుఫాను పరిస్థితులను అధిగమించగలిగామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు, పాత్రికేయ మిత్రులకు పోలీసు శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

నాలుగు చోట్ల నామినేషన్ల స్వీకరణ

నేడు రేపు వార్డుల రిజర్వేషన్ జాబితా

తాడేపల్లిగూడెం, పెన్ పవర్. అక్టోబర్ 30. మున్సిపల్ ఎన్నికల్లో తాడేపల్లిగూడెం పురపాలక సంఘానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నాలుగు సెంటర్లలో చేపడతారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ స్థానంతో పాటు నాలుగు వార్డుల కౌన్సిలర్లకు నామినేషన్లు స్వీకరిస్తారు. గణేష్ నగర్ ఇండోర్ స్టేడియంలో 4 నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు ఒక్కొక్క కేంద్రంలో నాలుగు వార్డులకు ఇక్కడ నామినేషన్ల స్వీకరిస్తారు దాదాపు 12 వార్డుల నామినేషన్లు ఇండోర్ స్టేడియంలో స్వీకరిస్తారు. శేషమాల్ థియేటర్ వెనుక సచివాలయాల వద్ద 16 వార్డులకు నామినేషన్లు స్వీకరిస్తారు ఈ మూడు సెంటర్లు కాకుండా టూ టౌన్ లో బ్రహ్మానంద రెడ్డి మార్కెట్ అన్న క్యాంటీన్ ప్రక్కన ఉన్న సచివాలయంలో 16 వార్డులకు నామినేషన్లు స్వీకరిస్తారు ఇలా పట్టణంలో 48 వార్డులకు నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ప్రణాళికను పురపాలక సంఘం రెడీ చేసి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు ఉన్నతాధికారులకు ఎన్నికల సంఘానికి పంపినట్టు మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం 35 వార్డులతో 23.8 కిలోమీటర్ల విస్తీర్ణం లో ఉండేది ఇప్పుడు విలీనమైన ఐదు గ్రామాలతో 48 వార్డులకు విస్తరించి మున్సిపాలిటీ 51 కిలోమీటర్ల పరిధికి పెరిగింది.

సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా 48 వార్డులతో 110 పోలింగ్ కేంద్రాలతో విస్తరించిన తాడేపల్లిగూడెం భవిష్యత్తులో మున్సిపల్ కార్పొరేషన్ కు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వార్డులతో నగర పాలక సంస్థగా తాడేపల్లిగూడెం ఆవిర్భవించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఏ నిమిషంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం పట్నంలో ఉన్న 48 వార్డులలో 11 వార్డులు జనరల్ కు కేటాయించే అవకాశం ఉంది. మహిళలకు 13 వార్డులు బీసీలకు 17 వార్డులు ఎస్సీలకు 6 వార్డులు ఎస్టీలకు ఒక వార్డు కేటాయించే విధంగా ఓటర్ల వివరాలు ఉన్నట్లు సమాచారం. మరో 24 గంటల్లో వార్డుల రిజర్వేషన్ జాబితా మున్సిపల్ కార్యాలయానికి చేరడానికి అవకాశం ఉంది శని ఆదివారాలు సెలవు అయితే సోమవారం నాటికి రిజర్వేషన్లు జాబితా వార్డులు వారిగా మున్సిపల్ కార్యాలయానికి జిల్లా కలెక్టర్కు చేరేందుకు అవకాశం ఉంది ఇది ఇలా ఉండగా మున్సిపల్ కౌన్సిలర్ కు నామినేషన్ వేసేందుకు ౦3,000 ధర వత్తు చెల్లించవలసి ఉంది. రిజర్వేషన్ అభ్యర్థులు 1500 రూపాయలు చెల్లించవలసి ఉంది.

జనవరి ఒకటి ఓటుకు ప్రామాణికం

2026 జనవరి ఒకటో తేదీ నాటికి తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ఓటరు గా నమోదయి ఉన్నవారికి ఓటు హక్కు లభిస్తుంది. ఇప్పటికే పట్టణంలో ఒక లక్ష 728 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు.

గంగవరంలో ఊపందుకున్న వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

మొల్లేరు, మర్రిపాలెం, మోహనాపురం పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించిన అభ్యర్థులు, నాయకులు

గంగవరం పెన్ పవర్ అక్టోబర్ 30: గంగవరం మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, నాయకులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలిసి తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి బల్లెం శివదొర, మొల్లేరు ఎంపీటీసీ అభ్యర్థి కుంజం పాపతో కలిసి మొల్లేరు పంచాయతీ పరిధిలోని బీఎస్ఆర్ పట్నం, ఆర్డీపురం, వడ్డిచెరువు, మొల్లేరు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ-1 కొటికలపూడి రామతులసి, మాజీ సర్పంచ్ కుంజం లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పండా సిద్ధార్థ దొర, యువజన విభాగం అధ్యక్షుడు ఈపీ సతీష్, జగదీష్, దొంగబాబు, అర్జన్నతో పాటు మొల్లేరు పంచాయతీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మర్రిపాలెం ఎంపీటీసీ అభ్యర్థి పీరు బాలురెడ్డికి మద్దతుగా మాజీ ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ బండారు రామలక్ష్మి ఆధ్వర్యంలో ఈ.రామవరం, ఎండపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మోహనాపురం పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులు మద్దేటి వెంకటలక్ష్మి, శారపు వెంకటలక్ష్మి, మడకం శివదొర, చోడి బాపనమ్మ, మేనక భార్గవికి మద్దతుగా పార్టీ నాయకులు ఆయా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ అభ్యర్థులు, నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేయడంతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కుతోంది.

ఆర్నబ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలు గురించి రైతుల కష్టాల వివరించిన ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 30. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు నరసాపురం అసెంబ్లీ నియోజవర్గం పర్యటనలో భాగంగా మొగల్తూరు గ్రామం నందు హెలిపాడ్ వద్ద గౌరవ ముఖ్యమంత్రివర్యులు కి స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ శబొలిశెట్టి శ్రీనివాస్ శాసనసభ్యులు తాడేపల్లిగూడెం. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వర్యులు వారికి తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజవర్గం నందు ఆర్నబ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలు గురించి రైతుల కష్టాల గురించి తెలియజేశారు. తాడేపల్లిగూడెం మండలం రూరల్ మొత్తం వరి పంట -29,575 ఎకరాలకు గాను 23,515 ఎకరాలు పంట పోయిందని పెంటపాడు మండలం -22,564 ఎకరాలు గాను 18,051 ఎకరాలు వరి పంట పూర్తిగా పాడైపోయిందని. ముఖ్యమంత్రివర్యులు వారికి నివేదిక అందజేసి రైతులను ఆదుకోవాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రివర్యులు సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు -గ్రా హై స్కూల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ గా ఎంపిక - నామినేషన్లకు 12 సెంటర్లు.

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 30. తాడేపల్లిగూడెం మున్సిపల్ ఎన్నికల నిమిత్తం ఏర్పాట్లు వేగవంతం చేశామని మున్సిపల్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఎమ్. యేసుబాబు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగ్గా హై స్కూల్ ను డిస్ట్రిబ్యూషన్ సెంటర్ గా, స్ట్రాంగ్ రూమ్ గా మరియు కౌంటింగ్ రూమ్ గాఎంపిక చేయడం జరిగింది.

అదే విధంగా నామినేషన్లు వేయడానికి మొత్తం 12 సెంటర్లను ఎంపిక చేయడం జరిగింది.

నామినేషన్ సెంటర్ల వివరాలు:

- మున్సిపల్ ఆఫీస్ లో - 1
- శేషమహల్ థియేటర్ వెనుక సచివాలయాల వద్ద - 4
- బి.ఆర్ మార్కెట్ సచివాలయాల వద్ద - 4
- ఇండోర్ స్టేడియం వద్ద - 3

ఈ 12 సెంటర్లలో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమ లో కమిషనర్ తో పాటు అసిస్టెంట్ కమిషనర్ డి భవాని బాబు, మున్సిపల్ ఇంజనీర్ వై వెంకట రమణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి సీతారాం, మున్సిపల్ మేనేజర్ పి ప్రసాదరావు, టౌన్ ప్లానింగ్ అధికారి వి జగదీశ్వర రావు, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు మేనేజర్ ఎం నాగరాజు మరియు పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా కూటమి అభ్యర్థుల కు మద్దతుగా ఎన్నికల ప్రచారం

ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 30: పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు.

శుక్రవారం గంగవరం మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జడ్పిటిసి అభ్యర్థి డాక్టర్ తీగల ప్రభ నెల్లిపూడి ఎంపీటీసీ అభ్యర్థి అనిక నాగేశ్వరరావు, లక్కొండ ఎంపీటీసీ అభ్యర్థి శారపు పావని తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అలాగే సూరంపాలెం ఎంపీటీసీ అభ్యర్థి శారపు భవాని, జెడ్పీటీసీ అభ్యర్థి తీగల ప్రభకు మద్దతుగా సూరంపాలెం ఎంపీటీసీ పరిధిలోని ఓజుబంద, జీఎం పాలెం, జగ్గంపాలెం పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో కూటమి నాయకులు సమష్టిగా ప్రచారం నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో ముల్లేరు పిఎసిఎస్ అధ్యక్షుడు పాము అర్జున బిజెపి మండల కమిటీ అధ్యక్షురాలు నీలాలమ్మ జనసేన అధ్యక్షుడు సిద్దు టిడిపి నాయకులు కనిగిరి సుభాష్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

ధర్మవరం జాతీయ రహదారిపై కోటి 35 లక్షలు విలువ చేసే 270.175 కేజీలు గంజాయి పట్టివేత.

- కాకినాడ జిల్లా పోలీస్, ఈగల్ టీం కీలక పాత్ర.
- ఇద్దరు నిందితుల అరెస్ట్.
- ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్, బి సూర్య అప్పారావు వెల్లడి.

కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్, 30: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై ఒరిస్సా రాష్ట్రం నుండి మహారాష్ట్ర వైపు వ్యాగనర్ కార్ లో ఎనిమిది బస్తాల్లో అక్రమంగా తరలిస్తున్న కోటి 35 లక్షల విలువ చేసే సుమారు 270.175 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సూర్య అప్పారావు తెలిపారు.శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతంతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.ఆయన తెలిపిన వివరాలు ప్రకారం శుక్రవారం ఉదయం గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్న పక్కా సమాచారం రావడంతో కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ పర్యవేక్షణలో, కాకినాడ జిల్లా ఈగల్ టీం సహకారంతో ప్రతిపాడు సీఐ బి. సూర్య అప్పారావు సూచన మేరకు ఎస్ఐ, ఎస్. లక్ష్మీకాంతం తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారన్నారు..ఈ తనిఖీల్లో ఎపి -31-బిఎన్ -9513 నంబరు గల మారుతి వ్యాగనర్ కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 8 బస్తాల్లో తరలిస్తున్న కోటి 35 లక్షలు విలువ చేసే సుమారు 270.175 కిలోల గంజాయితో పాటు కారు రెండు ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.అక్రమంగా గంజాయి తరలిస్తున్న అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బేన్న భూపాలపట్నం గ్రామానికి చెందిన ఆదిరాజు నాయుడు,పోతురాజు మణికంఠ అలియాస్ స్వామిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కేసులో మరో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు శాఖతో పాటు కాకినాడ జిల్లా ఈగల్ టీం సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎస్సై,ఎస్ లక్ష్మీకాంతంతోపాటు పోలీస్ సిబ్బందిని ఈగల్ టీమ్ సభ్యులను సి ఐ,సూర్యఅప్పారావు అభినందించారు.

సుందరంగా జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం

- రంగురంగుల మొక్కలు, ఆహ్లాదకరమైన వాతావరణం

జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 30: జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం సరికొత్త అందాలను సంతరించుకుంది. గతంలో సాధారణంగా కనిపించే కార్యాలయ ప్రాంగణం ప్రస్తుతం రంగురంగుల హంగులతో, పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా మారింది. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వివిధ రకాల మొక్కలను ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కార్యాలయానికి అందమైన రంగులు వేయడంతో పాటు ప్రహరీని సైతం ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పచ్చదనం, అందమైన మొక్కలు, పరిశుభ్రమైన పరిసరాలతో కార్యాలయ ప్రాంగణం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తలపిస్తోంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు సైతం ఈ మార్పు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం వాకర్స్ క్లబ్ వారు బెంచీలను ఏర్పాటు చేశారు. ఎంతోమంది జగ్గంపేట తహసిల్దార్లుగా పనిచేసినప్పటికీ ఎవరూ కూడా కార్యాలయ రూపురేఖలను పట్టించుకోలేదు. కానీ ప్రస్తుతం జగ్గంపేట తహసీల్దారుగా పనిచేస్తున్న జెవిఆర్ రమేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కార్యాలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ కార్యాలయాలు కేవలం పరిపాలనా కేంద్రాలుగానే కాకుండా పరిశుభ్రతకు, పచ్చదనానికి ప్రతీకగా నిలవాలనే విధంగా జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం రూపుదిద్దుకోవడం స్థానికంగా ఆకట్టుకుంటోంది.

పార్కు ప్రారంభం కాకుండానే చిన్నారుల ఆటలు

- ఆట పరికరాలు ధ్వంసమయ్యే ప్రమాదం
- అధికారుల పర్యవేక్షణ కరువైందంటున్న స్థానికులు

జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 30: ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు చిన్నారులకు ఆటవిడుపు కల్పించాలనే లక్ష్యంతో జగ్గంపేట శివారు కాకినాడ రోడ్డులో బంక్ ఎదురుగా కోనేరు వద్ద పార్కును ఏర్పాటు చేస్తున్నారు. అయితే పార్కు పనులు జరుగుతుండగా అక్కడ చిన్నారులు ఆటలాడుతుండటంతో ఆట పరికరాల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రజాధనంతో ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఏర్పాటు చేస్తున్న పార్కులో చిన్నారుల కోసం వివిధ రకాల ఆట పరికరాలను అమర్చారు. అయితే పార్కు పనులు పూర్తిస్థాయిలో ముగిసి, అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి రాకముందే వాటిని వినియోగిస్తుండటంతో పరికరాలు దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కు నిర్వహణ, ఆట పరికరాల పరిరక్షణపై సంబంధిత అధికారులు కనీస పర్యవేక్షణ చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రారంభానికి ముందే ఆట పరికరాలు పాడైతే వాటి మరమ్మతులకు మళ్లీ ప్రజాధనం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పార్కు నిర్మాణంపై చూపుతున్న శ్రద్ధ, దాని నిర్వహణపై కూడా చూపించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు పనులు పూర్తిచేసి, అధికారికంగా ప్రారంభించే వరకు ఆట పరికరాలకు రక్షణ కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పార్కు ప్రారంభమైన తర్వాత కూడా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొవ్వూరు, నిడదవోలు, మండపేట మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారం ముగిసింది

- మద్యం, నగదు పంపిణీపై ప్రత్యేక నిఘా
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 30: తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కొవ్వూరు, నిడదవోలు, మండపేట పురపాలక సంఘాల సాధారణ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎన్నికల ప్రచార గడువు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రచార కార్యక్రమాలు నిర్ణీత గడువులో ముగియడంతో, ఇకపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ప్రచార నిషేధ నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఆమె స్పష్టం చేశారు.

ప్రచార కార్యక్రమాలపై ఆంక్షలు

ప్రచార గడువు ముగిసిన అనంతరం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు, కార్యకర్తలు బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం తదితర ఎన్నికల ప్రచార కార్యక్రమాలను నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తే సంబంధిత వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బయటి వ్యక్తులు ఆయా ప్రాంతాలను విడిచి వెళ్లాలి

ఎన్నికలు జరిగే పురపాలక సంఘాల పరిధిలో ఓటర్లుగా నమోదు కాని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రచార ప్రతినిధులు ప్రచార గడువు ముగిసిన వెంటనే ఆయా ప్రాంతాలను విడిచి వెళ్లాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధం లేని వ్యక్తులు అక్కడ ఉండకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

సామాజిక మాధ్యమాలపైనా నిఘా

సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం, అభ్యర్థులకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ఓటర్లను ప్రభావితం చేసే ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రకటనలు, పోస్టులు, వీడియోలు తదితర అంశాలపై ఎన్నికల పర్యవేక్షణ బృందాలు నిఘా ఉంచుతాయని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సందేశాలు ప్రచారం చేయరాదని స్పష్టం చేశారు.

నగదు, మద్యం పంపిణీపై ప్రత్యేక నిఘా ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా నగదు, మద్యం, బహుమతులు లేదా ఇతర వస్తువుల పంపిణీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కు ముందు 48 గంటల వ్యవధిలో మద్యం పంపిణీ, సరఫరా, విక్రయాలపై నిషేధం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, పోలీసు శాఖ సమన్వయంతో తనిఖీలు కొనసాగిస్తాయని తెలిపారు.

నగదు, మద్యం పంపిణీపై ప్రత్యేక నిఘా

ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా నగదు, మద్యం, బహుమతులు లేదా ఇతర వస్తువుల పంపిణీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కు ముందు 48 గంటల వ్యవధిలో మద్యం పంపిణీ, సరఫరా, విక్రయాలపై నిషేధం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, పోలీసు శాఖ సమన్వయంతో తనిఖీలు కొనసాగిస్తాయని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు ఏర్పాట్లు

కొవ్వూరు, నిడదవోలు, మండపేట పురపాలక సంఘాల పరిధిలో ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ, సమస్యాత్మక ప్రాంతాల పర్యవేక్షణపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఓటరు ఎన్నికల రోజున తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు తప్పనిసరిగా పాటించి ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

అర్నాబ్ తుపాను నష్టాల పరిశీలనకు నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

- కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటన
- ఖరీఫ్ కరువు పరిస్థితుల అధ్యయనానికి మరో కేంద్ర బృందం రాక

అమరావతి/కాకినాడ పెన్ పవర్,అక్టోబర్ 30: అర్నాబ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సంభవించిన నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర బృందం శని, ఆదివారాల్లో పర్యటించనుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాష్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం (ఐఎంసీటీ) కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో పర్యటించి తుపాను నష్టాలను అంచనా వేయనుంది.ఈ విషయాన్ని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు.శనివారం ఆర్టీజీఎస్‌లో తుపాను సమయంలో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు, జరిగిన నష్టాలపై ఉన్నతాధికారులు కేంద్ర బృందానికి వివరించనున్నారు. అనంతరం రెండు బృందాలుగా విడిపోయి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు.మొదటి బృందానికి ఆర్టీజీఎస్ సీఈవో, ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్, రెండో బృందానికి సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు నేతృత్వం వహించనున్నారు. శనివారం మొదటి బృందం కోనసీమ జిల్లాలో, రెండో బృందం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నాయి.ఆదివారం మొదటి బృందం కాకినాడ జిల్లాలో, రెండో బృందం పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనున్నాయి. ఈ సందర్భంగా తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడంతో పాటు బాధితులతో మాట్లాడి నష్టాల వివరాలను సేకరించనున్నారు. సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రితో కేంద్ర బృందం సమావేశమయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు.

కేంద్ర బృందం సభ్యులు:

ప్రశాంత్ ఆర్మోరికర్ (వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఏడీసీ), రేఖారాణి కొల్లు (జలవనరుల మంత్రిత్వ శాఖ, సీడబ్ల్యూసీ సూపరింటెండింగ్ ఇంజనీర్), హిమాలయ గార్గ్ (ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్), రాకేష్ కుమార్ సింగ్ (రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్), అలోక్ జవహర్ (గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ), ప్రణయ్ గార్గ్ (విద్యుత్ మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్), డాక్టర్ ఎస్.వి.ఎస్.పి. శర్మ (ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సైంటిస్ట్).

ఖరీఫ్ కరువు పరిస్థితుల పరిశీలనకు మరో కేంద్ర బృందం

నాలుగు జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో పర్యటన

రాష్ట్రంలో ఖరీఫ్-2026 కరువు పరిస్థితులను పరిశీలించి అధ్యయనం చేసేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని పది మంది సభ్యుల కేంద్ర బృందం సోమ, మంగళవారాల్లో పర్యటించనుంది. శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రెండు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పర్యటించనుంది.ఈ సందర్భంగా కరువు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడంతో పాటు రైతులతో నేరుగా మాట్లాడి పంటల పరిస్థితి, వ్యవసాయ నష్టాలు, కరువు తీవ్రతను అంచనా వేయనున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ కరువు మాన్యువల్ నిబంధనల ప్రకారం ఖరీఫ్-2026లో రాష్ట్రంలోని 283 మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, 105 మండలాలను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించినట్లు ప్రఖర్ జైన్ తెలిపారు. బుధవారం ఈ కేంద్ర బృందం ముఖ్యమంత్రితో సమావేశమయ్యే అవకాశం ఉందన్నారు.

కేంద్ర కరువు పరిశీలన బృందం సభ్యులు:

ప్రభా కాంతి (మహాలనోబిస్ నేషనల్ క్రాప్ ఫోర్‌కాస్ట్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్), వినోద్ సామంత్ (గ్రామీణాభివృద్ధి శాఖ అండర్ సెక్రటరీ), పంకజ్ పహాడియా (వ్యయ విభాగం డిప్యూటీ డైరెక్టర్), ఎన్.వి. సతీష్ సీమాకుర్తి (మానిటరింగ్ అండ్ అప్రైజల్ డైరెక్టరేట్ డైరెక్టర్), డాక్టర్ కె. పొన్నుసామి (ఆయిల్ అండ్ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్), అనురాధ బటానా (నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్), ధీరేంద్ర కుమార్ (ఆర్ఐసీ), ప్రదీప్ కుమార్ (ఆహార, ప్రజా పంపిణీ శాఖ అండర్ సెక్రటరీ), డాక్టర్ సాక్షి భదౌరియా (పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ అధికారి) తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు తూలగిరి సీతారామస్వామి ఆలయంలో నూతన కళ్యాణ మండపం ప్రారంభం..

-14 లక్షల సొంత నిధులతో దాత గోపిశెట్టి శ్రీను భవన నిర్మాణం.

కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్,30: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని ప్రసిద్ధ తూలగిరి సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌలభ్యం కోసం నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం శుక్రవారం వైభవంగా ప్రారంబించారు ప్రత్తిపాడు,పరిసర ప్రాంతాల ప్రజలు వివాహాది శుభకార్యాలు, పూజా కార్యక్రమాలను ఉచితంగా,సులభంగా నిర్వహించుకునేలా ప్రజా ఉపయోగార్థం ఈ మండపాన్ని నిర్మించారు.స్థానిక దాతలు గోపిశెట్టి చిన అప్పారావు, రామలక్ష్మి దంపతుల కుమారుడు గోపిశెట్టి శ్రీను తన సొంత నిధులు రూ. 14 లక్షల వ్యయంతో ఈ కళ్యాణ మండప నిర్మాణాన్ని చేపట్టి దాతృత్వాన్ని చాటుకున్నారు.ప్రారంభంలో భాగంగా శుక్రవారం ఉదయం వేద పండితుడు తేజోమూర్తుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గణపతి పూజ, సీతారామ స్వామివారికి విశేష పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం దాత గోపిశెట్టి శ్రీను కొబ్బరికాయ కొట్టి కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా దాత గోపిశెట్టి శ్రీను మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరు మీద ప్రత్తిపాడు పరిసర ప్రాంతాల పేద, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు జరుపుకోవడానికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ మండపాన్ని నిర్మించినట్లు తెలిపారు. స్వామివారి సన్నిధిలో నిర్మించిన ఈ కళ్యాణ మండపాన్ని ప్రత్తిపాడు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండపం ప్రారంభోత్సవానికి వచ్చిన కాంట్రాక్టర్ దుళ్ళ దుర్గా మల్లేశ్వరరావు కల్యాణ మండపానికి, ఫ్యాన్లు, లైట్లు విద్యుత్ కాంతులకు సంబంధించి రూ. లక్ష రూపాయలు అందిస్తానన్నారు.

?ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులతో పాటు భక్తులు అనంతపల్లి శ్రీను, వెలుగురి హరే రామ్, చెలంకూరి భాను,గోగుల బుజ్జి, గోగుల సుబ్బరాజు, ప్రత్తిపాడు అయ్యప్ప స్వాములు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని మర్యాదపూర్వకంగా కలిసిన చదలవాడ మహాలక్ష్మి,బాబి.

-జ్యోతుల నవీన్,తుమ్మల బాబులతో మర్యాదపూర్వక భేటీ.

కిర్లంపూడి,పెన్ పవర్,అక్టోబర్, 30: కిర్లంపూడి మండలం జగపతినగరం-3 ఎంపీటీసీ స్థానం నుంచి కూటమి మద్దతుతో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చదలవాడ మహాలక్ష్మి, కిర్లంపూడి మాజీ సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి దంపతులు శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వారిని ఆప్యాయంగా పలకరించి, ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించాలని ఆశీర్వదించారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని, కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం డీసీసీబీ చైర్మన్, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల బాబును, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను చదలవాడ మహాలక్ష్మి బాబి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండల కూటమి నాయకులు జోకా శ్రీనివాస విజయ్ కుమార్, కాళ్ల వెంకటేష్, చిక్కాల కల్కిభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ క్రెడిట్ అతనికే దక్కుతుంది: అభిషేక్ శర్మపై యువరాజ్ సింగ్ ప్రశంసలు

- అభిషేక్ శర్మ కష్టానికి తగిన ఫలితం దక్కిందన్న యువరాజ్
- టీ20 ర్యాంకింగ్స్‌లో మళ్లీ నెం.1 స్థానానికి చేరిన అభిషేక్
- న్యూజిలాండ్‌పై 38 బంతుల్లో 113 పరుగులు చేసిన యంగ్ ఓపెనర్
- టీ20ల్లో అత్యధిక సెంచరీలు చేసిన భారతీయుడిగా కోహ్లీని అధిగమించిన అభిషేక్
- ఆధునిక క్రికెటర్లు రాణించడానికి స్పోర్ట్స్ సైన్స్ కారణమన్న యువీ

టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌పై మాజీ ఆల్‌రౌండర్, అతని మెంటార్ యువరాజ్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. అభిషేక్ కఠోర శ్రమ వల్లే అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ స్థాయికి ఎదిగాడని, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి నెం.1 స్థానాన్ని దక్కించుకోవడం వెనుక అతని కృషి అమోఘమని అన్నాడు.ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో అభిషేక్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. అక్టోబర్ 27న వెల్లింగ్‌టన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు చేసి భారత్‌కు 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. ఈ ఇన్నింగ్స్‌తో భారత్ 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది.ఒక కార్యక్రమంలో మాట్లాడిన యువరాజ్, అభిషేక్ విజయం గురించి ప్రస్తావించాడు. "అభిషేక్ శర్మ 30, 34 బంతుల్లో సెంచరీలు చేశాడు. ఇదంతా అతని కఠోర శ్రమకు ఫలితం అని నేను భావిస్తున్నాను. ఈ స్థాయికి రావడానికి అతను చాలా కష్టపడ్డాడు. ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో మళ్లీ నెం.1 స్థానానికి చేరుకున్నాడు. ఆ క్రెడిట్ అంతా అతనికే దక్కుతుంది" అని ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ వివరించాడు.ఈ సెంచరీతో టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు (11) చేసినం

భారతీయ క్రికెటర్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ (10) రికార్డును అధిగమించాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ జాబితాలో క్రిస్ గేల్ (22), బాబర్ అజామ్ (13) తర్వాత మూడో స్థానంలో ఉన్నాడు.భారత ఆటగాళ్లలో, ముఖ్యంగా వైట్-బాల్ క్రికెట్‌లో వస్తున్న మెరుగుదలను కూడా యువీ ప్రశంసించాడు. మెరుగైన రికవరీ పద్ధతులు, స్పోర్ట్స్ సైన్స్ కారణంగా ఆటగాళ్లు గాయాల నుంచి త్వరగా కోలుకుంటున్నారని, తమ ప్రదర్శనను మెరుగుపరుచుకుంటున్నారని తెలిపారు. మొత్తం మీద, తన మెంటార్ అయిన యువరాజ్ మార్గదర్శకత్వంలో అభిషేక్ శర్మ అద్భుతంగా రాణిస్తూ టీమిండియాలో కీలక ఆటగాడిగా ఎదుగుతున్నాడు.

అమ్మ చెప్పిన నెంబర్.. రోహిత్ శర్మ 'జెర్సీ నెంబర్ 45' వెనుక కథ ఇదే!

- తన జెర్సీ నెంబర్ 45 వెనుక ఉన్న కథను పంచుకున్న రోహిత్ శర్మ
- అండర్-19లో 19వ నెంబర్ జెర్సీతో ఆడినట్లు వెల్లడి
- రాహుల్ ద్రావిడ్ కారణంగా ఆ నెంబర్‌ను వదులుకున్నట్లు తెలిపిన హిట్ మ్యాన్
- అమ్మ సలహాతో 4+5=9 అయ్యేలా 45 నెంబర్‌ను ఎంచుకున్నట్లు వివరణ

టీమిండియా 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ తన ఐకానిక్ జెర్సీ నెంబర్ 45 వెనుక ఉన్న ఆసక్తికరమైన కథను అభిమానులతో పంచుకున్నాడు. తాను హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే గేమింగ్ రియాలిటీ షోలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ జెర్సీ నెంబర్‌ను ఎంచుకోవడం వెనుక తన తల్లి పాత్ర కీలకమని రోహిత్ తెలిపాడు.ఈ షోలో నటుడు రాహుల్ లోహాని.. "సర్, 45 నెంబర్ జెర్సీ చూడగానే హిట్ మ్యాన్ వచ్చాడని అందరికీ అర్థమవుతుంది. కానీ మీరు ఈ నెంబర్‌నే ఎందుకు ఎంచుకున్నారు?" అని ప్రశ్నించారు. దీనికి రోహిత్ బదులిస్తూ, తొలినాళ్లలో అండర్-19 ఆడుతున్నప్పుడు తనకు 19వ నెంబర్ జెర్సీ కేటాయించారని చెప్పాడు. ఆ నెంబర్ అంటే ఇష్టంతోనే ఆడానని, కానీ ఆ తర్వాత సీనియర్ జట్టులోకి వస్తే ఆ నెంబర్‌ను కొనసాగించలేవని ఒకరు చెప్పారని గుర్తుచేసుకున్నాడు. అప్పట్లో టీమిండియా కెప్టెన్‌గా ఉన్న రాహుల్ ద్రావిడ్ 19వ నెంబర్ జెర్సీతో ఆడేవారని, అందుకే ఆ నెంబర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని వివరించాడు."ఆ నెంబర్‌తో ఆడలేనని తెలియగానే, వెంటనే హోటల్‌కు వెళ్లి మా అమ్మకు ఫోన్ చేశాను. ఏ నెంబర్ తీసుకోవాలో చెప్పమని అడిగాను. అప్పుడు అమ్మ 'న్యూమరాలజీ ప్రకారం 9 వచ్చేలా చూసుకో, నీకు మంచిది' అని సలహా ఇచ్చింది" అని రోహిత్ తెలిపాడు. అయితే 9వ నెంబర్ అప్పటికే వేరొకరు తీసుకున్నారని, 27 (2ం7=9) తీసుకోవడం ఇష్టం లేదని చెప్పాడు. "అదే సమయంలో 4, 5 అంకెలు పక్కపక్కన ఉంటే బాగుంటుందనిపించింది. ఈ విషయాన్ని అమ్మకు చెప్పి, 4ం5 కలిపితే 9 వస్తుంది కదా అని ఒప్పించాను. అలా '45' నెంబర్‌ను ఎంచుకున్నాను" అంటూ తన జెర్సీ వెనుక ఉన్న కథను రోహిత్ వివరించాడు.కాగా, 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' కార్యక్రమం సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రసారం అవుతుండగా, సోనీ లివ్ యాప్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

260 పరుగుల లక్ష్యం ముందు భారత్ తడబాటు.. న్యూజిలాండ్ ఘన విజయం

భారత్‌పై న్యూజిలాండ్‌కు 87 పరుగుల విజయం

కివీస్ స్కోరు 259/7.. భారత్ 172/9

లక్ష్య ఛేదనలో తడబడ్డ భారత బ్యాటర్లు

ఫిలిప్స్ 49 బంతుల్లో 107 పరుగులు

ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 3-1

న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20లో భారత జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. గ్లెన్ ఫిలిప్స్ (107; 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లు), మైకేల్ బ్రేస్‌వెల్ (65; 25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసక ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు తడబడటంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 172 పరుగులకే పరిమితమైంది. దీంతో కివీస్ 87 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 3-1కి తగ్గింది.

టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే న్యూజిలాండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ఫిన్ అలెన్ (31; 17 బంతుల్లో) వేగంగా పరుగులు రాబట్టగా, డారిల్ మిచెల్ 9 బంతుల్లోనే 24 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా నితీశ్ కుమార్ రెడ్డి వేసిన 16వ ఓవర్‌లో ఫిలిప్స్ వరుసగా నాలుగు సిక్సర్లు బాదాడు. నోబాల్‌తో కలిపి ఆ ఓవర్‌లో 32 పరుగులు వచ్చాయి. బ్రేస్‌వెల్ కూడా ధాటిగా ఆడటంతో ఐదో వికెట్‌కు వీరిద్దరూ కేవలం 40 బంతుల్లోనే 115 పరుగులు జోడించారు. ఫిలిప్స్ సెంచరీ పూర్తి చేసుకోగా.. బ్రేస్‌వెల్ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 48 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు.

260 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ రెండు బంతులకే, ఇషాన్ కిషన్ మూడు బంతులకే పెవిలియన్ చేరారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (22) కొద్దిసేపు పోరాడినా భారీ భాగస్వామ్యం నెలకొల్పలేకపోయారు. నితీశ్ రెడ్డి 10 బంతుల్లో 21 పరుగులు చేసి దూకుడు చూపించాడు. అయితే వరుస విరామాల్లో వికెట్లు పడటంతో భారత్ 89 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ వర్మ (35; 35 బంతుల్లో), నమన్ ధీర్ (28; 13 బంతుల్లో) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 32 పరుగులు జోడించారు. నమన్ ధీర్ ఔటైన తర్వాత భారత పోరాటం మరింత బలహీనపడింది. తిలక్ వర్మ కూడా 19వ ఓవర్‌లో వెనుదిరగడంతో భారత్ ఓటమి ఖాయమైంది. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ నాలుగు వికెట్లు తీసి భారత పతనాన్ని శాసించాడు. మ్యాట్ ఫిషర్, మిచెల్ శాంట్నర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. నిజానికి న్యూజిలాండ్ ఫీల్డర్లు పలు క్యాచ్‌లను జార విడిచారు. లేదంటే భారత్ ఇంకాస్త ముందే ఓటమిని చవిచూసేది. అద్భుత సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఫిలిప్స్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు.

టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్‌కి...

హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు.

రాకా సినిమాలో మృణాల్...

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న రాకా సినిమాలో ఈమె నటిస్తుందా అనే విషయంలో కూడా ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు. కొత్త సినిమాలు ఏమీ చేయక పోయినా ఎప్పటికప్పుడు అందమైన ఫోటోలు, వీడియోలతో మృణాల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మరోసారి అందాల ఫోటోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 16 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా స్కిన్ షో ఫోటోలు, అప్పుడప్పుడు ఇలాంటి అందమైన ఔట్ ఫిట్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తే వైరల్ కావడం పెద్ద వింతేమి కాదు, కానీ ఇలా నిండుగా ఉన్న ఫోటోలను షేర్ చేసిన సమయంలో కూడా వైరల్ అయితే అప్పుడు వారి బ్యూటీకి ఒక విలువ ఉన్నట్టు అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

రాయల్ ఫ్రేమ్‌లో పాలక్.. గ్లామర్ ఒకే కానీ..

ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఫోటో షూట్...

స్కిన్ షో చేయకున్నా మృణాల్ ఇలాంటి ఫోటో షూట్స్ తో కూడా చూపు తిప్పనివ్వదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఒక బ్రాండ్ ప్రమోటింగ్ ఫోటో షూట్ అని తెలుస్తోంది. బెంగళూరు డైరీస్ అంటూ ఈ ఫోటోలకు ఇన్‌స్టాగ్రామ్ లో మృణాల్ కామెంట్ పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ ను చూస్తూ ఉంటే కాస్త బరువు తగ్గినట్టు అనిపిస్తుందని, తన గత చిత్రాలతో పోల్చితే ఈ ఫోటోల్లో సన్నగా, చిక్కిందా అన్నట్లుగా కనిపిస్తుందని నెటిజన్స్ అంటున్నారు. మృణాల్ కెరీర్ ఆరంభంలో కాస్త ఎక్కువ బరువు కలిగి ఉండేది. అయినా కూడా చాలా అందంగా ఉండేది. అయితే కొందరు సన్నబడితే అందం తగ్గుతుందని అంటారు. కానీ మృణాల్ విషయంలో అది నిజం కాదని ఈ ఫోటోలు చూస్తే అర్థం అవుతుంది. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లుగా ఈ ఫోటోలకు మృణాల్ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలకు తెలుగు అభిమానులు తెలుగులో సినిమా ఎప్పుడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మృణాల్ సమాధానం ఏంటో మరి...!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com